సాక్షి
నిర్మల్
శనివారం । 13 । ఏప్రిల్ । 2024



సమయం లేదు మిత్రమా..!
లోక్‌సభ ఎన్నికల పోలింగ్ వచ్చేనెల 13న జరగనుంది. అర్హులైన కొత్త ఓటర్లందరూ తమ పేర్లను నమోదు చేసుకోవడానికి ఈనెల 15 వరకు చివరి గడువుగా ఉంది. 10లో▸



గుట్టపైన.. గుహలోన..
కలియుగ దైవంగా పేరొందిన వేంకటేశ్వరుడికి కోటను తలపించే దేవరకోట దేవస్థానాన్ని నిమ్మల రాజులు నిర్మించారు. 11లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
34.4 /24.8
ఆకాశం చాలావరకు మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు బాగా తగ్గుతాయి. వాతావరణం చల్లబడుతుంది. చాలాచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కామోల్‌లో కుంకుమార్చన



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

భైంసారూరల్: మండలంలోని కామోల్ శ్రీసీతారామస్వామి ఆలయంలో నవమి వేడుకలు కొనసాగుతున్నాయి. శుక్రవారం కుంకుమార్చన పూజలు చేశారు. గ్రామానికి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అంతకు ముందు హరిమౌనస్వామి ప్రవచనాలు చేశారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికబాటలో పయనించాలని సూచించారు. ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత దొరుకుతుందని పేర్కొన్నారు. ప్రతీ వ్యక్తి దేవుని కోసం సమయం కేటాయించాలన్నారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులను ఎప్పటికీ మర్చిపోవద్దని సూచించారు. అనంతరం భక్తులంతా స్వామివారిని దర్శించుకున్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



సర్టిఫికెట్లు పొందిన మహిళలు

నిర్మల్‌టౌన్: స్వయం ఉపాధిలో శిక్షణ పొందిన మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలని అందుకు ఆర్థిక సహకారం అందిస్తామని ఐడీఎం చంద్రశేఖర్ తెలిపారు. సబ్బులు, డిటర్జెంట్, ఫినాయిల్, టాయిలెట్ క్లీనర్, వాషింగ్ మిషన్ లిక్విడ్ తయారీలో శిక్షణ పొందిన మహిళా సంఘాల సభ్యులకు జిల్లా కేంద్రంలోని ఎస్సీ కమిటీ హాల్‌లో శుక్రవారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నెల రోజులపాటు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. శిక్షణ పొందిన వారు తయారు చేసే వస్తువులు నాణ్యత లోపించకుండా ఉండాలన్నారు. మహిళా సంఘం సభ్యులు మాట్లాడుతూ.. స్వయం ఉపాధి శిక్షణ తమకు ఆర్థికంగా తోడ్పడుతుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మెప్మా పీడీ సుభాష్, శిక్షణ పొందిన మహిళలు పాల్గొన్నారు.

రేపు ఎస్టీయూ శిక్షణ

నిర్మల్ రూరల్: స్టేట్ టీచర్స్ యూనియన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఆదివారం శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యస్.భూమన్నయాదవ్, జె.లక్ష్మణ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జుట్టు గజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని పెన్షనర్ల భవనంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. శిబిరాన్ని రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యం.పర్వత్‌రెడ్డి, సదానందంగౌడ్ ప్రారంభిస్తారన్నారు. విషయ నిపుణులతో ఫండమెంటల్ రూల్స్, లీవ్ రూల్స్, సీసీఏ రూల్స్ తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారన్నారు. జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన సంఘం సభ్యత్వం ఉన్న ఉపాధ్యాయులు ఈ శిక్షణ తరగతులను వినియోగించుకోవాలని సూచించారు.

‘షోకాజ్ నోటీసులు సరికాదు’

కడెం: పార్లమెంట్ ఎన్నికల మొదటి విడత ట్రెనింగ్‌కు హాజరైన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు కలెక్టర్ షోకాజ్ నోటీసులు పంపడం సరికాదని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు భూక్య రాజేశ్‌నాయక్ పేర్కొన్నారు. ఈనెల 4న ట్రెనింగ్ హాజరై ఫాం 12ను అందజేశామని తెలిపారు. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతోనే తమకు నోటీసులు వచ్చాయని వెల్లడించారు. సంబంధిత అధికారులపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు.


సీఎంఆర్ పూర్తిచేయాలి



మిల్లును తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్

భైంసాటౌన్/నర్సాపూర్ (జి)/కుంటాల: రైస్ మిల్లులకు కేటాయించిన ధాన్యం సీఎంఆర్ ప్రక్రియ వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ సూచించారు. భైంసాలోని కల్లూరులోని ఆంజనేయ రైస్‌మిల్, లోకేశ్వరంలోని ద్వారక, నర్సాపూర్(జి) మండలం చాక్‌పెల్లిలోని లక్ష్మీప్రభు రైస్‌మిల్లులను తనిఖీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఆయా మిల్లుల్లో ధాన్యం నిల్వలు, అప్పగించిన బియ్యం, తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. 2023–24 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి గడువులోగా మిల్లింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించినట్లు తెలిపారు. జాప్యం చేసే మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తర్వాత కుంటాల మడలం అర్లి(కె)గోదాంను పరిశీలించారు. ఖరీఫ్‌లో సేకరించిన ధాన్యాన్ని నిల్వలు ఉంచకుండా చూసుకోవాలని సూచించారు.

వామ్మో.. చిరుత!





బెంబర గ్రామంలో చెట్టుపై దూడ కళేబరం

- సరిహద్దు మండలాల్లో సంచారం
- తరచూ పశువులపై దాడి
- ఆందోళన చెందుతున్న గ్రామీణులు
- పట్టించుకోని అటవీశాఖ అధికారులు..

తానూరు: మహారాష్ట్ర సరిహద్దున ఉన్న జిల్లాలోని పలు మండలాల ప్రజలను చిరుతలు భయపెడుతున్నాయి. కొన్ని నెలలుగా పశువులపై దాడిచేసి చంపేస్తున్నాయి. చాలా ఏళ్ల తర్వాత మహారాష్ట్ర వైపు ఉన్న గుట్టల నుంచి చిరుత పులులు జిల్లాలోని గ్రామాల్లోకి వస్తున్నాయి. తాజాగా తానూరు మండలం బెంబర గ్రామ శివారులో రైతు లచ్చన్న చేనులో కట్టేసిన లేగదూడపై దాడిచేసి చంపేసింది. దానిని సమీపంలోని చెట్టుపైకి తీసుకెళ్లి సగం తినేసింది.

సరిహద్దు మండలాల్లో సంచారం...

సరిహద్దు మండలాలైన తానూరు, భైంసా, కుభీర్, ముధోల్, కుంటాల, సారంగాపూర్ మండలాలు అటవీ ప్రాంతం కలిగి ఉంది. మహారాష్ట్ర నుంచి వస్తున్న చిరుతలు జిల్లాలోని అటవీ ప్రాంతాల మీదుగా గ్రామాల సరిహద్దులకు వస్తున్నాయి. పొలాల వద్ద సంచరించే పశువులపై దాడి చేసి చంపుతున్నాయి. గతంలో ఈ విషయమై పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంఘటన జరిగినప్పుడే గ్రామానికి వస్తున్న అటవీ అధికారులు చిరుతల రాకుండా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

భయందోళనలో రైతులు, గ్రామీణులు..

తానూరు, కుభీర్, కుంటాల, ముధోల్, సారంగాపూర్, భైంసా మండలాల్లో చిరుతల సంచారం ఎక్కువగా ఉండడంతో, సరిహద్దు గ్రామాల రైతులు పొలాలు అటవీ ప్రాంతంలో ఉండడంతో చిరుతలు ఎటు నుంచి వచ్చి దాడి చేస్తాయో అని ఆందోళన చెందుతున్నారు. రాత్రి వేళల్లో పశువులపై దాడి చేస్తుండడంతో పంటలకు కాపలా వెళ్లలేకపోతున్నామని చెబుతున్నారు. ఇతర గ్రామాలకు వెళ్లిన వారు రాత్రి సమయంలో తమ గ్రామాలకు రావడానికి కూడా జంకుతున్నారు. తమకు రక్షణ చర్యలు చేపట్టాలని అటవీశాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడంపై ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చిరుత పులులను గుర్తించి గ్రామాల్లోకి రాకుండా నియంత్రణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

చర్యలు చేపడతాం


మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలైన బెంబర, ఝరి(బి), మహలింగి, బామ్ని, భోసి, అటవీ ప్రాంతంలో చిరుత సంచారిస్తూ పశువులపై దాడి చేస్తోంది. జరిగిన ఘటలను పరిశీలించి చిరుత ఆనవాళ్లుగా గుర్తించాం. తాజాగా బెంబర గ్రామంలో దూడపై చిరుత దాడి చేసినట్లు ధ్రువీకరించాం. రైతులు అప్రమత్తంగా ఉండాలి. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చిరుతల సంచారం లేకుండా చర్యలు చేపడతాం.

– మహేశ్, అటవీశాఖ బీట్ అధికారి

జరిగిన ఘనటలు...

- తానూరు మండలం బెంబర శివారులో గురువారం రాత్రి రైతు లచ్చన్న తన వ్యవసాయ పొలంలో ఆవులను కట్టివేసి ఇంటికి వెళ్లాడు. దూడపై చిరుత పులి దాడి చేసి, చెట్టుపైకి తీసుకెళ్లి చంపి తినేసింది. ఉదయం చేను వద్దకు వచ్చి చూడగా చెట్టుపై దూడ కళేబరం కనిపించడంతో చిరుత దాడిగా గుర్తించాడు. అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాడు. అటవీశాఖ బీట్ అధికారి మహేశ్ గ్రామానికి చేరుకుని చిరుత దాడిలోనే లేగ దూడ మృతిచెందినట్లు ధ్రువీకరించారు.
- మూడు నెలల క్రితం బెంబర –ఝరి(బి) ఆటవీ ప్రాతంలో చిరుత దాడి చేసి మేకను చంపి తినేసింది.
- మూడు నెలల క్రితం సారంగాపూర్ మండలం మలక్‌చించోలి గ్రామంలో చిరుత ఆవుపై దాడి చేసింది.
- నాలుగు నెలల క్రితం ముధోల్ మండలం రాంటెక్ గ్రామ శివారులో చిరుత పులి మేకపై దాడి చేసింది.
- 8 నెలల క్రితం మహలింగి శివారు ప్రాంతంలో గ్రామానికి చెందిన జంకోడ్ విఠల్ అనే రైతు వ్యవసాయ పొలంలో ఆవును కట్టివేశాడు. రాత్రి సమయంలో చిరుత ఆవుపై దాడిచేస్తున్న క్రమంలో అరుపులు విని అటు వైపు వెళ్లేసరికి చిరుత అక్కడి నుంచి పారిపోయింది.
- గతేడాది అదే గ్రామానికి చెందిన హల్దా భోజన్న రైతుకు చెందిన ఆవును హతమార్చింది.
- గతేడాది బామ్ని శివారులోని అటవీ ప్రాంతంలో బామ్ని గ్రామానికి చెందిన షేక్ హుసేన్‌కు చెందిన ఆవుపై చిరుత దాడి చేసి హతమార్చింది. అటవీ శాఖ అధికారులు చిరుత పులిగా నిర్ధారించారు.
- గతంలో కుంటాల మండలం సూర్యపూర్ గ్రామంలోని అటవీ ప్రాంతంలో ఎడ్లబండిపై వెళ్తున్న ముగ్గురు రైతులకు చిరుత పులి కనిపించింది.

అమ్మచెంత.. ఆత్మహత్యలు!



బాసర వద్ద గోదావరి వంతెన

- సూసైడ్ స్పాట్‌గా మారిన బాసర గోదావరి
- గోదావరి వంతెనపై కానరాని రక్షణ చర్యలు
- నదీ తీరంలో కొరవడి నిఘా
- రెండు జిల్లాల సరిహద్దుపై దృష్టిపెట్టాలంటున్న ప్రజలు

భైంసా: బాసర గోదావరి తీరం సూసైడ్ స్పాట్‌గా మారింది. కొన్ని రోజులుగా సుదూర ప్రాంతాల నుంచి వచ్చి గోదావరిలో దూకి కొందరు ఆత్మహత్య చేసుకోగా, కొందరి ప్రాణాలను అటుగా వెళ్తున్న యువకులు కాపాడారు. మరికొందరిని నదిలో దూకిన తర్వాత జాలర్లు, గజ ఈతగాళ్లు రక్షించారు. బాసర జ్ఞాన సరస్వతీ అమ్మవారి చెంత ఆత్మహత్యలు ఆదోళన కలిగిస్తున్నాయి వంతెనపై, నదీతీరంలో నిఘా లేకపోవడంతో సూసైడ్ స్పాట్‌గా మారిందని పట్టణ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గత నెలలో...

బాసర రైల్వే స్టేషన్‌లో మార్చి 27న యువతీ, యువకుడు నర్సాపూర్–నాగర్‌సోల్ రైలు కింద పడి ఆత్మహత్యచేసుకున్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నిషిత డిగ్రీ కాలేజీలో డిగ్రీ చదివిన చక్రవర్తుల నందితతోపాటు మరో యువకుడు బలవన్మారణానికి పాల్పడ్డారు. ఈ సంఘటన జరిగిన కొద్ది రోజుల్లో బాసర గోదావరి తీరంలో కుటుంబ కలహాలతో ఎంతో మంది మహిళలు ఆత్మహత్య చేసుకునేందుకు వస్తున్నారు. బాసరకు చెందిన యువకులు ఆందోళనలో ఉన్న మహిళలను గుర్తించి బాసర పోలీసులకు సమాచారం ఇస్తున్నారు. పోలీసులు అక్కడికి వచ్చి బాధితులతో మాట్లాడి వారి ఇబ్బందులు తెలుసుకుని కుటుంబీకులకు సమాచారం ఇచ్చి కౌన్సెలింగ్‌చేసి పంపిస్తున్నారు. అటు నిజామాబాద్.. ఇటు నిర్మల్.. మరో వైపు మహారాష్ట్రకు సరిహద్దుగా బాసర ఉంది. మూడు ప్రాంతాల నుంచి ఏదో ఒక సంఘటనలో ఇక్కడికి వచ్చి ఆత్మహత్య చేసుకుంటుండడం ఆందోళన కలిగిస్తోంది. రెండు నెలలుగా ఈ సంఘటనలు పెరిగిపోయాయి.

రక్షణ కరువు..

ఎంతో మంది ఆత్మహత్య చేసుకునేందుకు బాసర వస్తుండగా వారికి కౌన్సెలింగ్ చేసి పంపిస్తున్న పోలీసులు గోదావరి తీరంలో రక్షణ చర్యలపై దృష్టి పెట్టడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకపక్క గోదావరిలో ఆత్మహత్యలు పెరుగుతుంటే.. మరోవైపు అధికారుల నిర్లక్ష్యంతో పుణ్యస్నానాలకు వచ్చిన భక్తులు కూడా ప్రమాదాలబారిన పడుతున్నారు. 2023 అక్టోబర్ 1న నిజామాబాద్‌లోని పాములబస్తీకి చెందిన సంతోష్(18) స్నేహితులతో కలిసి బాసరకు వచ్చాడు. గోదావరిలో స్నానాల కోసం దిగి మృతిచెందాడు. 2023 అక్టోబర్ 6న నిజామాబాద్‌లోని గాజులపేట్‌కు చెందిన దుబ్బాక ఓడ్డయ్య(35) కూతురు పుట్టువెంట్రుకలు తీసేందుకు బాసరకు వచ్చాడు. ఆనవాయితీ ప్రకారం శుభకార్యానికి ముందు గోదావరిలో తెప్పను వదిలేందుకుదిగాడు. నీటిలోనే మునిగి మృతిచెందాడు. ఈనెలలో మొదటి వారంలో నిజామాబాద్‌కు చెందిన ఇద్దరు భక్తులు మృతిచెందారు. బాసర గోదావరి నది వద్ద తరచూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నా అధికారులు రక్షణ చర్యలు చేపట్టడం లేదు.

నిఘా పెంచాలి...

బాసరకు ఏటా వేలాది మంది భక్తులు వస్తుంటారు. నదీతీరంలో ప్రాణాలు కాపాడేందుకు నిఘా పెంచాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో బాసర గోదావరి వంతెన నుంచి స్నాన ఘట్టాల వరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షణచేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు. గోదావరి వంతెన నుంచి స్నాన ఘట్టాల వరకు పోలీసు సిబ్బందిని విధుల్లో ఉండేలా చూడాలి. ఆత్మహత్యలను ఆపేలా చర్యలు తీసుకోవాలి. బాసరకు వచ్చేవారు నది వద్ద ఆందోళనగా కనిపిస్తే వారిని గుర్తించి కౌన్సెలింగ్ ఇస్తే నిండు ప్రాణాలు కాపాడే అవకాశం ఉంటుంది.

రక్షణ చర్యలు తీసుకుంటాం

బాసర గోదావరి తీరంలో పుణ్యస్నానాలు ఆచరించే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం. స్నానఘట్టాల వద్ద ఇక్కట్లులేకుండా చూస్తాం. గోదావరి నదిలో గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుతాం.

– విజయరామారావు, ఆలయ ఈవో

గతంలో జరిగిన కొన్ని ప్రమాదాలు..

బాసర గోదావరి నదికి వచ్చిన వారిలో చాలా మంది 35 ఏళ్లలోపు వారే ఉంటున్నారు. కొంత మంది విద్యార్థులు కూడా పుణ్యస్నానాలకు నీటిలో దిగి మృత్యువాత పడుతున్నారు.

- 2022, ఏప్రిల్ 4న హైదరాబాద్ బజారాహిల్స్ సరస్వతీ హైస్కూల్ విద్యార్థులు పదో తరగతి పరీక్షల సందర్భంగా బాసర సరస్వతి అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చారు. గోదావరి నదిలో స్నానాలకు వెళ్లిన విద్యార్థుల్లో విశాల్ (15) నీటిలో మునిగి మృతిచెందాడు.
- 2022, మే14న మహారాష్ట్రలోని అకోల పట్టణానికి చెందిన 17 మంది విద్యార్థుల బృందం అమ్మవారి దర్శనానికి వచ్చారు. నదిలో స్నానంచేస్తుండగా కిరణ్(22) నీటిలో మునిగి పోయాడు. గమనించిన మరో విద్యార్థి ప్రతీప్(22) రక్షించబోయి నీటమునిగి మృతిచెందాడు.
- 2022, జూలై 14న ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగో లు జిల్లా కందకూరు మండలం పొన్నులూ రు గ్రామానికి చెందిన విద్యార్థి మణికంఠ(14) పుణ్యస్నానానికి వెళ్లి మృత్యువాతపడ్డాడు.
- 2023 మహాశివరాత్రి పర్వదినాల్లో మహారాష్ట్రకు చెందిన ప్రదీప్(25) పుణ్యస్నానానికి వెళ్లి మృత్యువాతపడ్డాడు.

బీఆర్‌ఎస్‌కు భవిష్యత్ లేదు

- డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు



కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న శ్రీహరిరావు

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీకి భవిష్యత్ లేదని, త్వరలోనే ఆ పార్టీ ఖాళీ అవుతుందని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు అన్నారు. సోన్ మండలం సంగంపేట్ మాజీ సర్పంచ్ మారి విలాస్, మాజీ వార్డు సభ్యులతోపాటు దాదాపు 100 మంది శుక్రవారం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. శ్రీహరిరావు వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్నారని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఎంపీ అభ్యర్థి సుగుణ భారీ మెజారిటీతో గెలుస్తుందని ప్రకటించారు. ఆమె విజయానికి అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సోన్ మండల నాయకులు శ్రీనివాస్ గౌడ్, మాదాపూర్ మాజీ సర్పంచ్ రాజనర్సింహారెడ్డి, గంజల్, మొహినొద్దీన్, సోన్ మాజీ సర్పంచ్ సముందర్‌పెల్లి సాయన్న, అంబేకర్ ప్రసాద్, రాజేశ్వర్, కిషన్‌రెడ్డి, అజర్ పాల్గొన్నారు.

ఆగని పసిడి పరుగు

భైంసాటౌన్: పసిడి ధర పైపైకి వెళ్తోంది. సామాన్యులకు అందనంత ఎత్తుకి చేరుకుంటోంది. గతనెల వరకు నిలకడగా ఉన్న బంగారం ధర ఈనెలలో సరికొత్త గరిష్ఠ ధరలు నమోదు చేస్తోంది. ఈనెల ప్రారంభంలో పది గ్రాముల ధర రూ.70 వేలు ఉండగా, 12 రోజుల వ్యవధిలో ఏకంగా రూ.6 వేలు పెరిగింది. ఈనెల 6న ఒకే రోజు మూడుసార్లు ధర పెరిగి రూ.73,200లకు చేరుకోగా, శుక్రవారం ఏకంగా నాలుగుసార్లు ధరల్లో హెచ్చుదల నమోదైంది. శుక్రవారం ధరలు పరిశీలిస్తే.. ఉదయం పది గ్రాములకు రూ.74,700 ఉండగా, మధ్యాహ్నం రూ.75,500, సాయంత్రం 3.40 గంటలకు రూ.75,800లకు పెరిగి రూ.76 వేల వద్ద స్థిరపడింది. దీంతో బంగారు, వెండి వర్తకులతోపాటు కొనుగోలుదారులు సైతం పెరుగుతున్న బంగారం ధరలతో ఆందోళన చెందుతున్నారు.

ఇంటర్ ఎక్కడైతే బాగుంటుంది..

జిల్లా కేంద్రానికి చెందిన పవన్‌ది మధ్యతరగతి కుటుంబం. చిన్నపాటి దుకాణం నడుపుతూ భార్య, ఇద్దరు బిడ్డలను పోషించుకుంటున్నాడు. పెద్దబిడ్డ మొన్ననే పదోపరీక్షలు రాయగా, రెండో బిడ్డ 7వ తరగతి చదువుతోంది. చిన్నప్పటి నుంచి తాను బాగా చదవనందునే తన పరిస్థితి ఇలా తయారైందన్న ఆలోచనతో పవన్ తన పిల్లలిద్దరికీ మంచి చదువులు చెప్పిస్తున్నాడు. పెద్దబిడ్డ పదోతరగతి పరీక్షలు పూర్తికావడంతో ఇంటర్ ఎక్కడ చదివించాలి, తనను ఏ కోర్సులో జాయిన్ చేయాలన్న ఆలోచనలో పడ్డాడు. తనకు తెలిసిన టీచర్లు, బాగా చదివిన మిత్రులను అడుగుతున్నాడు. తమ బిడ్డను తీసుకుని తల్లిదండ్రులిద్దరూ ఇప్పటికే ఓసారి హైదరాబాద్ వరకూ వెళ్లారు. మూడునాలుగు కాలేజీలను చూసొచ్చారు. అయినా వారికి ఎటూ పాలుపోవడం లేదు. ఫీజులు చూస్తే భారీగా ఉన్నాయి.. మరి అదే స్థాయిలో అక్కడ చదువులు ఉంటాయా..? నాణ్యమైన ఆహారం పెడతారా..? తమ బిడ్డ అక్కడి వాతావరణాన్ని తట్టుకుంటుందా..? ఇలా ఎన్నో ఆలోచనలు పవన్ మదిలో తిరుగుతున్నాయి. ఇదంతా ఒకెత్తు.. ఆ రూ.లక్షలుగా ఉన్న ఫీజు డబ్బులు చెల్లించడం ఒకెత్తు.. అంటూ భార్య చెప్పిన మాటలూ తరచూ గుర్తుకు వస్తున్నాయి. పవన్ ఒక్కడికే కాదు.. ఆయనలాంటి తల్లిదండ్రులందరూ ఇప్పుడు ఇదే పరిస్థితిలో ఉన్నారు. పదో తరగతి పరీక్షలు రాసిన తమ పిల్లల చదువులు, వారి భవిష్యత్తుపైనే ఆలోచన చేస్తున్నారు.

- ఏ కోర్సులో చేర్పించాలి..
- పై చదువులపై తల్లిదండ్రుల ఆరా..
- ఇప్పటికే పలు కాలేజీల్లో అడ్మిషన్లు
- ఇంటి వరకూ వస్తున్న 'కార్పొరేట్లు'
- భారం కావొద్దంటున్న మానసిక నిపుణులు



నిర్మల్‌రూరల్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో తల్లిదండ్రులకు పిల్లల చదువులపైనే బెంగ ఉంది. తమ సంపాదనలో సగానికిపైగా వారి చదువులకే పెట్టాల్సి వస్తోంది. చాలామంది అప్పులు చేసి మరీ.. ఫీజులు కడుతున్నారు. పిల్లల చదువుల కోసమే ఉన్న ఊళ్లను విడిచి నిర్మల్, భైంసా, ఖానాపూర్, నిజామాబాద్, హైదరాబాద్ వంటి పట్టణాలు, నగరానికి వెళ్తున్న కుటుంబాలూ చాలానే ఉన్నాయి. నిర్మల్ జిల్లా కేంద్రమైన తర్వాత విద్యావ్యవస్థలో చాలా మార్పులు వచ్చాయి. పదుల సంఖ్యలో కార్పొరేట్ కాలేజీలు నెలకొల్పారు. ఏ కాలేజీ అయితే బాగుంటుందో తల్లిదండ్రులు ఆరా తీస్తున్నారు. కొందరు జిల్లా కేంద్రంలో అడ్మిషన్ తీసుకుంటుండగా మరికొందరు తమ స్తోమత కొద్దీ నిజామాబాద్, హైదరాబాద్ నగరాల్లో ఉన్న ఫేమస్ కాలేజీల్లో పిల్లలను జాయిన్ చేస్తున్నారు.

ఇంటి వరకు వస్తున్న కార్పొరేట్లు....

పది పరీక్షలు ముగియడంతో ఇక కార్పొరేట్ కాలేజీలు అడ్మిషన్ల కోసం పల్లె, పట్టణ ప్రాంతాలపై ఫోకస్ పెట్టాయి. ఏజెంట్లను నియమించుకు అడ్మిషన్ల దందా మొదలు పెట్టాయి. ప్రైవేట్ వారితోపాటు.. ప్రభుత్వ ఉపాధ్యాయులు కూడా కమిషన్‌కు ఆశపడి కార్పొరేట్ ఏజెంట్లుగా పని చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వారికి నెలవారీ జీతాలు అందించడంతోపాటు, భారీ మొత్తంలో కమీషన్లు కూడా ముట్ట చెబుతున్నారు. సదరు ఏజెంట్లు తల్లిదండ్రుల ఫోన్ నంబర్లు, ఇంటి అడ్రస్‌లు తెలుసుకుని మరీ ఇంటికి వచ్చి విద్యార్థుల అడ్మిషన్ చేస్తున్నారు. దీంతో మధ్యతరగతి తల్లిదండ్రులు తమ పిల్లలను కార్పొరేట్ కాలేజీలో చేర్పించాలంటేనే బెంబేలెత్తుతున్నారు.

సామాన్యులకు అందని ఫీజులు..

పదో తరగతి వరకు తమ పిల్లల చదువు కోసం వేలల్లో ట్యూషన్ ఫీజు చెల్లించిన తల్లిదండ్రులు ఇంటర్మీడియట్ కోసం లక్షల్లో చెల్లించాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు. జిల్లా కేంద్రంతోపాటు భైంసా, ఖానాపూర్ పట్టణాలలో పదుల సంఖ్యలో ఇంటర్మీడియట్ కాలేజీలు ఉన్నాయి. వీటిల్లో ట్యూషన్ ఫీజు రూ.75 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నారు. పుస్తకాలు, నోట్ బుక్కులు, పరీక్ష ఫీజులు అదనం. నిజామాబాద్, హైదరాబాద్ వంటి కార్పొరేట్ కాలేజీల్లో రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఫీజులు ఉంటున్నాయి. ఆర్థికంగా లేనివారు మాత్రం ప్రభుత్వ కళాశాల వైపు చూస్తున్నారు. మరికొందరు తమ బిడ్డ భవిష్యత్తు బాగుండాలని అప్పు చేసి కార్పొరేట్ కళాశాలలో చేర్పిస్తున్నారు. ఏది ఏమైనా ఇంటర్మీడియట్ కార్పొరేట్ చదువులు మధ్యతరగతి, దిగువస్థాయి తల్లిదండ్రులకు భారంగా మారుతున్నాయి.

కార్పొరేట్ మాయలో పడొద్దు..

తల్లిదండ్రులు కార్పొరేట్ మాయలో పడొద్దు. కార్పొరేట్ కాలేజీల్లో విద్యార్థులపై తీవ్రమైన ఒత్తిడి ఉంటోంది. దీంతో విద్యార్థులు అనాలోచితమైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ కళాశాలల్లో కూడా అన్ని సౌకర్యాలు ఉంటున్నాయి. తమ ఆర్థిక వెసులుబాటు మేరకు తల్లిదండ్రులు నిర్ణయం తీసుకోవాలి. పిల్లలపై ఒత్తిడి లేకుండా చూసుకోవాలి.

– డాక్టర్ సురేశ్, మానసిక నిపుణుడు

ధైర్యంగా ఓటు వేయాలి



ఫ్లాగ్ మార్చ్ లో పాల్గొన్న సీఆర్పీఎఫ్ బలగాలు

నర్సాపూర్(జి): ప్రజలు ధైర్యంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని 99–ఎఫ్ సీఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్లు అమర్‌కుమార్‌శర్మ, కై లాష్‌చందు, ఎస్సై హన్మాండ్లు సూచించారు. మండల కేంద్రంలో శుక్రవారం సీఆర్పీఎఫ్ బలగాలు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలు శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించినట్లు తెలిపారు. పోలీస్ సిబ్బంది మహేందర్, రమేశ్, కృష్ణ, శ్రీనివాస్, షహీద్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణచాందకు చేరిన ఎస్సారెస్పీ నీళ్లు

లక్ష్మణచాంద: కొద్ది రోజులుగా మండలంలోని సరస్వతి కాలువకు నీళ్లు రాకపోవడంతో పంటలు ఎండిపోయే దశకు చేరుకున్నాయి. రైతుల విజ్ఞప్తి మేరకు గురువారం సాయంత్రం అధికారులు ఎస్సారెస్పీ నుంచి నీటిని విడుదల చేశారు. దీంతో శుక్రవారం ఉదయం వరకు మండలానికి నీళ్లు చేరాయి. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

తవ్వకాల్లో బయటపడ్డ నాడీ గణపతి



నాడీ గణపతికి పూజలు చేస్తున్న భక్తులు..

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్ శ్రీరాజ శ్యామల ఆలయ ప్రాంగణంలో భూమి చదును చేస్తుండగా స్వయంభూ నాడీ గణపతి విగ్రహం లభ్యమైనట్లు శివరాజ యోగ కృష్ణస్వామి తెలిపారు. ఉగాది తర్వాత అమ్మవారి వసంత నవరాత్రి ఉత్సవాల్లో చవితి రోజు ఈ 5 అడుగుల నాడీ గణపతి విగ్రహం లభించడం శుభ సూచకమన్నారు. చవితి సందర్భంగా పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో స్థిర ప్రతిష్టాపన చేస్తామని చెప్పారు.

మొరం తరలిస్తున్న ట్రాక్టర్లు పట్టివేత

సారంగపూర్: మండలంలోని జామ్ గ్రామంలో నాగమ్మ చెరువు నుంచి అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఎస్సై చంద్రమోహన్ శుక్రవారం పట్టుకున్నారు. వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ట్రాక్టర్లు కనిపించడంతో డ్రైవర్లను విచారణ చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్నట్లు గుర్తించి వాటిని పోలీస్‌స్టేషన్ తరలించామని ఎస్సై తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం రెవెన్యూ అధికారులకు అప్పగించామని పేర్కొన్నారు.

బాసర రైల్వేస్టేషన్‌లో చోరీ

భైంసా: బాసర రైల్వే స్టేషన్‌లో శుక్రవారం దొంగతనం జరిగింది. మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌కు చెందిన ఓ కుటుంబం గురువారం బాసర సరస్వతి అమ్మవారిని దర్శించుకుని రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. రాత్రికి బాసర స్టేషన్‌లోని వెయిటింగ్ రూమ్‌లో వీరంతా నిద్రపోయారు. ఈ కుటుంబంలో ముగ్గురు అంధులే. నిద్రిస్తున్న సమయంలో దొంగలు వీరివద్ద ఉన్న పత్రాలు, నగదును దోచుకెళ్లారు. శుక్రవారం ఉదయం వారి వద్ద నగదు కనిపించలేదు. డబ్బులు పోగొట్టుకున్న ఈ కుటుంబీకులు తిరుపతికి వెళ్లలేక ఇంటికి తిరుగు పయనమయ్యారు. ఈ విషయమై రైల్వే పోలీసులను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు. రైల్వేస్టేషన్‌లో సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ దొంగతనాలు జరుగడం గమనార్హం.

ట్రాక్టర్ కింద పడి బాలుడు మృతి

కడెం: ట్రాక్టర్ కింద పడి బాలుడు మృతి చెందిన ఘటన మండలంలోని నచ్చన్ఎల్లాపూర్ గ్రామంలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. నచ్చన్ఎల్లాపూర్ గ్రామానికి చెందిన ఊరే లక్ష్మి–రాజన్న దంపతుల కుమారుడు శేఖర్(13) స్నేహితులతో కలిసి వెళ్లాడు. ట్రాక్టర్ ఎక్కుతుండగా ముందు (ఇంజిన్) భాగం వద్ద అదుపుతప్పి కిందపడ్డాడు. వెంటనే శేఖర్‌పై నుంచి ట్రాక్టర్ టైర్లు ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం వచ్చి పోలీసులు వచ్చి విచారణ చేపట్టారు.

చికిత్స పొందుతూ మృతి

చెన్నూర్‌రూరల్: మండలంలోని సుందరసాల గ్రామానికి చెందిన కొండేటి సంజీవ్ (45) చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. సంజీవ్ కుటుంబ కలహాల కారణంగా అతడి భార్య గత నెల రోజుల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. నెల రోజులైనా భార్య రావడం లేదని సంజీవ్ మనస్తాపం చెంది ఈ నెల 9న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108లో ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొం దుతూ సంజీవ్ గురువారం రాత్రి మృతిచెందినట్లు పేర్కొన్నారు.

సమయం లేదు మిత్రమా..!

- నూతన ఓటు నమోదుకు మరో 3 రోజులే..
- రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఓటేసే అవకాశం
- ఈ నెల 15 ముగియనున్న గడువు





ఓటరు నమోదు పోర్టల్ ఇదే

నియోజకవర్గాల వారీగా ఓటర్లు, పోలింగ్‌కేంద్రాల వివరాలు..

నియోజకవర్గం	ఓటర్లు	పోలింగ్ కేంద్రాలు
నిర్మల్	2,54,681	306
ముథోల్	2,50,978	311
ఖానాపూర్	2,21,837	305
ఆదిలాబాద్	2,43,535	290
బోథ్	2,10,915	302

నిర్మల్‌ఖిల్లా: లోక్‌సభ ఎన్నికల పోలింగ్ వచ్చేనెల 13న జరగనుంది. అర్హులైన కొత్త ఓటర్లందరూ తమ పేర్లను నమోదు చేసుకోవడానికి ఈనెల 15 వరకు చివరి గడువుగా ఉంది. అంటే మరో మూడు రోజుల్లో ఓటు నమోదుకు అవకాశం ముగియనుంది. ఇప్పుడు ఓటు నమోదు చేసుకున్నా లోక్‌సభ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. గత శాసనసభ ఎన్నికల్లో అర్హులై ఉండి కూడా ఓటు నమోదు చేసుకోకపోవడంతో ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవకాశం లేకపోయిన వారు, ఏప్రిల్ 1 నాటికి 18 ఏళ్లు నిండినవారు కూడా ప్రస్తుతం ఓటరుగా నమోదు చేసుకోవచ్చు.

యువతరం కదలాలి...

ప్రస్తుతం డిగ్రీ కోర్సులు, ఇంజినీరింగ్ చదువుతున్న వారు 18 ఏళ్లు నిండిన వారై ఉంటారు. అయితే ఓటరు జాబితాలో చోటు సంపాదించుకోవడానికి ఇదే సరైన తరుణం. కొత్త ఓటరుగా ఓటును నమోదు చేసుకుంటే వచ్చేనెల నిర్వహించనున్న లోక్‌సభ ఎన్నికల్లో తొలిసారిగా ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. దీనిపై జిల్లాస్థాయి అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. 18 ఏళ్లు నిండిన వారంతా యువ ఓటర్లుగా తమ హక్కును వినియోగించుకోవచ్చు. లోక్‌సభ ఎన్నికల ఓటర్ల అనుబంధ జాబితాను ఈనెల 25న ప్రదర్శించనున్నారు. ఓటరు జాబితాలో తమ పేరు లేనట్లయితే ఈ మూడు రోజుల్లోగా నమోదు చేసుకోవచ్చు.

క్షేత్రస్థాయి పరిశీలనలో బీఎల్వోలు..

18 ఏళ్లు నిండి ఓటరు జాబితాలో పేరులేని యువతీ, యువకుల కోసం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని బూత్ లెవల్ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలనలో ఆరా తీస్తున్నారు. నిర్మల్ జిల్లాలోని ముథోల్, ఖానాపూర్, నిర్మల్ శాసనసభ నియోజకవర్గం పరిధిలోని మొత్తం 922 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో ఉన్న బూత్‌ల స్థాయి నుంచి యువతీ, యువకులకు అవగాహన కల్పిస్తూ ఓటరు నమోదుపై చైతన్యం కలిగిస్తున్నారు.

ఓటు నమోదు ఇలా...

ముందుగా ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో చూసుకోవాలి. గతేడాది నవంబరులో జరిగిన శాసనసభ ఎన్నికల్లో దూర ప్రాంతాల నుంచి సొంత స్థలాలకు వచ్చిన ఓటర్లు కొందరు తమ జాబితాలో పేరు లేదని తెలియడంతో నిరాశకు గురయ్యారు. ఇలాంటి పరిస్థితి తలెత్తకుండా ముందుగా జాబితాను సరిచూసుకోవాలి. ప్రజాస్వామ్యయుత ప్రక్రియలో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవచ్చు. ఇందుకుగాను 18 ఏళ్ల నిండిన వారందరూ అర్హులే. 2006 మార్చి 31 కంటే ముందు పుట్టిన వారందరూ ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. ఇందుకు ఫారం–6 నింపి తగిన ధ్రువీకరణ పత్రాల కాపీలను పాస్ ఫొటోలను జతపరిచి బూత్ లెవెల్ అధికారికి అందించాలి. లేదా మీ చేతిలో ఉన్న స్మార్ట్ ఫోన్ ద్వారా, దగ్గర్లోని ఆన్‌లైన్ సెంటర్ లోనైనా https//:nvsp.in, https//:ceotelangana. nic.in అనే వెబ్‌సైట్‌లలో లాగిన్ అయి దరఖాస్తు చేసుకోవచ్చు. ఓటర్ జాబితాలో పేరు గల్లంతైన వారు, అర్హత ఉండి కూడా నేటికీ ఓటరు జాబితాలో పేరు లేని వారంతా దరఖాస్తు చేసుకోవచ్చు.

గంజాయి నిర్మూలనే లక్ష్యం

- ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్
- గాదిగూడలో 18 కిలోల గంజాయి పట్టివేత



పట్టుకున్న గంజాయితో ఎస్సైలు రవికిరణ్, మహేశ్‌కుమార్

నార్నూర్: ఏజెన్సీలో గంజాయి నిర్మూలనే లక్ష్యంగా పోలీస్‌శాఖ పని చేస్తుందని డీఎస్పీ నాగేందర్ అన్నారు. గాదిగూడ మండలంలో శుక్రవారం భారీగా గంజాయి పట్టుబడింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్పీ గౌస్ ఆలం ఆదేశాల మేరకు మండలంలోని చిత్తగూడ, కునికాస, కొటాల గ్రామాల్లో సోదాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ క్రమంలో గంజాయి లభించిన ఐదుగురితోపాటు ఆదిలాబాద్‌కు చెందిన మరో వ్యక్తిని అదుపులోకి తీసుకుని అనంతరం రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. వారి నుంచి రూ.4.50లక్షల విలువ చేసే 18కిలోల గంజాయి, ఒక ద్విచక్ర వాహనంతో పాటు మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఎవరైనా గంజాయి విక్రయించినా, సాగుచేసినా, నిలువ ఉంచినా చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో సీఐ రహీంపాషా, ఎస్సైలు రవికిరణ్, మహేశ్‌కుమార్, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

రూ.5 లక్షలు పట్టివేత



పట్టుబడ్డ నగదుతో పోలీసులు



వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

సారంగపూర్: మండలంలోని కౌట్ల(బి)–సారంగాపూర్ గ్రామాల మధ్య మలక్‌చించోలి ఎక్స్‌రోడ్డు వద్ద పోలీసులు శుక్రవారం వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇద్దరి నుంచి రూ.5 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. మండలంలోని మలక్‌చించోలి గ్రామానికి చెందిన గోస్కుల పోశెట్టి వద్ద రూ.3.50 లక్షలు, దేవితండాకు చెందిన రాథోడ్ ప్రహ్లాద్ వద్ద రూ.1.50 లక్షలు పట్టుకున్నట్లు తెలిపారు. నగదుకు సంబంధించి ఎలాంటి పత్రాలు చూపకపోవడంతో నగదును కలెక్టర్ కార్యాలయంలోని గ్రీవెన్స్ అధికారులకు అందజేశామని పేర్కొన్నారు.

లోకేశ్వరంలో రూ.90 వేలు..

లోకేశ్వరం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద శుక్రవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా మండలంలోని రాయపూర్‌కాండ్లీ గ్రామానికి చెందిన నాగేశ్ వద్ద రూ.90 వేల నగదు లభించిందని ఎస్సై రాజు తెలిపారు. ఈ నగదుకు ఎటువంటి ఆధారాలు చూపక పోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

రూ.1.16లక్షల నగదు సీజ్

నేరడిగొండ: బోథ్ మండలం ఘన్‌పూర్ చెక్‌పోస్టు వద్ద ఎలాంటి రశీదు, పత్రాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.1లక్ష 16వేలను పోలీసులు శుక్రవారం సీజ్ చేశారు. తనిఖీ సమయంలో ఓ కారులో ఈ నగదు పట్టుబడింది. మహారాష్ట్ర నుంచి తెలంగాణ సరిహద్దులోకి కారులో వస్తుండగా నగదు పట్టుకున్నట్లు ఎస్సై రాము తెలిపారు.

డ్రైవర్‌గా చేరిన మూడు రోజులకే..

- ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ మృతి
- న్యాయం చేయాలని కుటుంబ సభ్యుల డిమాండ్



దాస్లరాజు(ఫైల్)



మృతదేహం వద్ద రోధిస్తున్న కుటుంబసభ్యులు

కుంటాల: ట్రాక్టర్ అదుపు తప్పి డ్రైవర్ మృతిచెందిన ఘటన మండలంలోని ఓలా శివారులో శుక్రవారం జరిగింది. గ్రామానికి చెందిన దాస్ల రాజు(40) కాయకష్టం చేసి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గతంలో దిలావర్‌పూర్ మండలం గుండంపెల్లి గ్రామంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేశాడు. ఉగాది సందర్భంగా స్వగ్రామంలో ఓలాలో నరేందర్ అనే యజమాని వద్ద డ్రైవర్‌గా పనిలో చేరాడు. శుక్రవారం ఓ రైతు మొక్కజొన్నను నూర్పిడి చేయగా మెదన్‌పూర్ శివారు కెనాల్ ప్రాంతంలో కల్లంలో అరబెట్టేందుకు ట్రాక్టర్‌లో తీసుకెళ్లి వస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌పై నుంచి పడిపోయాడు. ఈ ఘటనలో ముఖం, తలకు బలమైన గాయాలయ్యాయి. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రాజు మృతిపై అనుమానాలు ఉన్నాయని విచారణ చేపట్టాలని కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. ఎస్సై రజినీకాంత్ ఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపడతామని హామీ ఇవ్వడంతో శాంతించారు. రాజుకు భార్య రుక్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రజినీకాంత్ తెలిపారు.

ఇంద్రాదేవి ఆలయం.. సమస్యలమయం

- తాగునీటికి తీవ్ర ఇక్కట్లు
- నైవేద్యాల తయారీకి తప్పని తిప్పలు
- ఇబ్బందుల్లో భక్తులు



ఉన్న ఒక్క చేతి పంపు వద్ద అవస్థలు పడుతున్న భక్తులు

ఇంద్రవెల్లి: ఆదివాసీల ఆరాధ్యదైవం.. నిత్యం భక్తుల పూజలందుకునే ఇంద్రాదేవి ఆలయంలో సమస్యలు తిష్టవేశాయి. కనీస సౌకర్యాలు లేక పూజలకు వచ్చిన భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రస్తుతం చైత్ర మాసం కావడంతో పూజలకు భారీగా తరలివస్తున్నారు. ఈ క్రమంలో ఉన్న ఒక్క చేతి పంపు వద్ద గంటల తరబడి వేచి ఉండాల్సిన దుస్థితి. తాగునీటి కోసం చుట్టు పక్కల ఇళ్లలో సేకరించాల్సి వస్తోందని భక్తులు పేర్కొంటున్నారు. అలాగే ఆలయ ప్రాంగణంలో సరిపడా స్థలం లేక వ్యవసాయ మార్కెట్ యార్డుతో పాటు ఇతర ప్రాంతాల్లో ఇక్కట్ల నడుమ వంటలు చేసి ఇంద్రాదేవికి నైవేద్యాలు సమర్పిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి ఆలయంలో నీటి సౌకర్యంతో పాటు వంటలు చేయడానికి ఆలయానికి ఉన్న స్థలాన్ని అభివృద్ధి చేయాలని ఆదివాసీలు కోరుతున్నారు.



బయటనుంచి నీటిని తీసుకొస్తున్న యువతులు



మార్కెట్‌యార్డులో వంటలు చేస్తున్న ఆదివాసీలు



అభివృద్ధికి నోచుకోని ఇంద్రాదేవి ఆలయ స్థలం

శబరిమలలో నిర్మల్‌వాసి మృతి

నిర్మల్‌టౌన్: నిర్మల్ జిల్లా కేంద్రంలోని చింతకుంట వాడకు చెందిన తమ్మరాశి రాజన్న (67) శబరిమలలో మృతి చెందాడు. విషు పూజలో పాల్గొనేందుకు రెండు రోజుల క్రితం అల్లుడు, మనుమళ్లతో కలిసి శబరిమల వెళ్లాడు. గురువారం అయ్యప్ప దర్శనం కోసం చిన్నపాదం నడుస్తూ... అస్వస్థతకుగురై మృతి చెందాడు. రాజన్నకు భార్య లక్ష్మి, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. కూతుళ్లందరికీ పెళ్లి కావడంతో దంపతులు ఇద్దరే ఉంటున్నారు.

మురుగు కాలువలో పడి వ్యక్తి మృతి

ఎదులాపురం: మురుగు కాలువలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలో వెలుగు చూసింది. స్థానికుల కథనం ప్రకారం.. సంచార జాతికి చెందిన చౌహాన్ సంతోశ్ (40) కాలకృత్యాలు తీర్చుకోవడంలో భాగంగా శుక్రవారం ఉదయం 8 గంటలకు పట్టణంలోని సాత్నాల ఓల్డ్ క్వార్టర్స్ వైపు వెళ్తుండగా ప్రమాదవశాత్తు క్వార్టర్స్ సమీపంలోని మురుగు కాలువలో పడ్డాడు. అందులోని బురదలో చిక్కుకొని బయటకు రాలేక మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ ఎస్సై నారా యణ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించి వివరాలు ఆరా తీశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'ఇంద్రాదేవి' బాటలో..



ఎడ్లబండ్లతో ఇంద్రాదేవి ఆలయానికి వస్తున్న వాల్గొండ ఆదివాసీలు

ఇంద్రవెల్లి: చైత్రమాసం సందర్భంగా ఇంద్రాదేవి ఆలయంలో ఆదివాసీలు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మండలంలోని వాల్గొండ గ్రామస్తులు శుక్రవారం ఎడ్లబండ్లతో ఆలయానికి చేరుకున్నారు. అలాగే ఉట్నూర్, నార్నూర్, గుడిహత్నూర్, జైనూర్ మండలాల ఆదివాసీలు సైతం ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. నెల రోజుల పాటు పూజలు కొనసాగుతాయని ఆలయ మహరాజ్ సూర్యరావ్ తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ఆదివాసీ పెద్దలు కినక లచ్చు పటేల్, కినక జుగాదిరావ్, మెస్రం సోమేశ్వర్ తదితరులున్నారు.



నైవేద్యాలు, సంప్రదాయ వాయిద్యాలతో ఆలయానికి వస్తున్న ఆదివాసీలు

అదుపుతప్పి కారు బోల్తా



బోల్తా పడిన కారు

దస్తురాబాద్: అదుపుతప్పి కారు బోల్తా పడిన సంఘటన మండలంలోని బుట్టాపూర్ గ్రామ సమీపంలో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కారు బుట్టాపూర్ శివారు వాగు సమీపంలోని మూల మలుపు వద్ద వేగంగా రావడంతో అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. ఈ ఘటనలో అందులో ప్రయాణిస్తున్న ఉట్నూర్ మండల కేంద్రానికి చెందిన ఇద్దరికి గాయాలయ్యాయి. సమీపంలోని పొలాల్లో పనిచేస్తున్న కూలీలు గమనించి వెంటనే క్షతగాత్రులను కారులో నుంచి బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

రెండు బైక్‌లు ఢీకొని నలుగురికి గాయాలు



గాయపడిన యువకుడు

జన్నారం: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో నలుగురు యువకులు గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా బీర్నందికి చెందిన యువకులు ద్విచక్ర వాహనంపై జన్నారం మండలంలోని ఓ శుభకార్యానికి వస్తుండగా, ఇందన్‌పల్లి గ్రామ సమీపంలో జన్నారం నుంచి ఇందన్‌పల్లి వైపు వస్తున్న ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ వాహనాలపై వెళ్తున్న బీర్నందికి చెందిన పెంద్రం తిరుపతి, సుదర్శన్, సంతోష్‌లు, జన్నారానికి చెందిన అనీల్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని స్థానికులు 108 ద్వారా ఆసుపత్రికి తరలించారు. ఏఎస్సై రాథోడ్ బిక్కులాల్ సంఘటన స్థలానికి పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించామని, ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఏఎస్సై తెలిపారు.

హథ్‌గాంలో మద్యం పట్టివేత



హథ్‌గాంలో పట్టుకున్న మద్యం

లోకేశ్వరం: మండలంలోని హథ్‌గాం గ్రామానికి చెందిన నాగభూషణం బెల్ట్ షాపులో మ ద్యం అమ్ముతుండగా లోకేశ్వరం పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ఎస్సై రాజు తెలి పిన వివరాల ప్రకారం.. హథ్‌గాంలో నాగభూషణం అక్రమంగా మద్యం అమ్ముతున్న ట్లు అందిన సమాచారంతో తనిఖీలు చేశా రు. అతని వద్ద రూ.5,500 విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నారు. నాగభూషణంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తానూరు: మండలంలోని ఎల్వి గ్రామంలో అ క్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్‌షాపుపై పోలీ సులు శుక్రవారం దాడి చేశారు. అక్రమంగా విక్రయిస్తున్న మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై సందీప్ తెలిపిన వివరా ల ప్రకారం.. ఎల్వి గ్రామానికి చెందిన సాయినాథ్‌గౌడ్ బెల్ట్‌షాపు నిర్వహిస్తున్నాడు. అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు అందిన సమాచారంతో శుక్రవారం రాత్రి పోలీసులు దాడి చేశారు. అక్రమంగా నిల్వ ఉంచిన రూ. 4,188 విలువైన మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న మద్యాన్ని ఎక్సైజ్ అధికారులకు అప్పగించనున్నట్లు తెలిపారు.